క్లుప్తంగా

నేడు గ్రామాల్లో గడప గడపకు

ముంచంగిపుట్టు: మండలంలోని మాకవరం సచివాలయం పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఆర్.వి.ఎస్.రమేష్ తెలిపారు. కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పాల్గొంటున్నారని, ఈ కార్యక్రమానికి అన్ని శాఖాలధికారులు పాల్గొవాలని కోరారు.

రావణాపల్లిలో

కొయ్యూరు: మండలంలోని రావణాపల్లి సచివాలయం పరధిలో బుధవారం మధ్యాహ్నం నుంచి తోటలూరు, రేగడివీధి, పాత రావణాపల్లి, రావణాపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఎంపీడీవో లాలం సీతయ్య మంగళవారం తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పాల్గొంటారన్నారు.అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

చింతూరులో వైద్య శిబిరం నేడు

చింతూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య మంగళవారం తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన అకీరా కంటి ఆస్పత్రి, జీఎస్ఎల్ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ శిబిరంలో కంటికి సంబంధించిన వ్యాధులు, క్యాన్సర్‌కు సంబంధించిన అన్నిరకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తారని, నాలుగు మండలాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం

గూడెంకొత్తవీధి: పెదవలస సచివాలయం, ఆర్‌బీకేలను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి బుధవారం ఉదయం ప్రారంభిస్తారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర కార్పొరేషన్ చైర్మన్లు హాజరు కావాలని కోరారు.

ఏకలవ్య పాఠశాలలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి నరేంద్ర

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో చవిటిదిబ్బలు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 142 మంది విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించారు. వివిధ రకాల వ్యాధులపట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు పట్ల విద్యార్థినులకు వైద్యాధికారులు అవగాహన కల్పించారు. వైద్యాధికారులు నరేంద్ర, దినేష్, ఎంఎల్‌పీహెచ్‌వో కుమారి, హెల్త్ సూపర్‌వైజర్ కళావతి, ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల భవనాల ఏర్పాటుకు స్థలాల పరిశీలన

సీలేరు: గుమ్మరేవుల్ పంచాయతీ కొల్తురుకోట, చింతకుప్ప గ్రామాల్లో నూతన పాఠశాల భవనాల ఏర్పాటుకు స్థలాలను ఎంఈవో సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఇటీవల పాడేరులోని స్పందన కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆయా గ్రామస్తులు కలిసి పాఠశాలల కోసం విన్నవించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ఆయన ఆదేశాల మేరకు గ్రామానికి వెళ్లి పరిశీలించినట్టుగా ఎంఈవో చెప్పారు. సీఆర్పీ దేవేంద్రకుమార్, మాజీ సర్పంచ్ బాబూరావు తదితరులున్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

డుంబ్రిగుడ: మండలంలోని గసభ స్వగ్రామానికి చెందిన పద్దు నవోమి(13) అనారోగ్యంతో మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలికకు చిన్నతనం నుంచి ఫిట్స్ ఉందని, ఇంట్లో ఎవరూ లేని సమయంలో మూర్ఛ రావడంతో ఆదివారం మృతి చెందినట్టు తండ్రి భాస్కరరావు, తల్లి మచ్చులమ్మ చెప్పారు. జాముగుడ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో నవోమి తొమ్మిదో తరగతి చదువుతుంది. ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యార్థిని నవోమి ఆరోగ్యం బాగానే ఉందని, ఆమె తల్లి శుక్రవారం పాఠశాలకు వచ్చి బాలికను తమ గ్రామానికి తీసుకెళ్లారని చెప్పారు.

ప్రగతి పథంలో మన్యం

- అందుబాటులో ప్రభుత్వ పాలన
- శరవేగంగా గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు
- గిరిజనుల హర్షాతిరేకాలు



కాశీపట్నంలో రైతు భరోసా కేంద్రం



చిలకలగెడ్డలో గ్రామ సచివాలయ భవనం

అనంతగిరి: గతంలో పలు పంచాయతీ కార్యాలయాలు, ఇతరత్రా ప్రభుత్వ శాఖల భవనాలు దారుణంగా ఉండేవి. వర్షం పడితే గదులన్నీ నీటితో నిండిపోయేవి..రికార్డులు తడిసిపోయేవి. గోడలు బీటలు వారి దర్శనమిచ్చేవి..

సౌకర్యాలు లేక సిబ్బంది సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ భవనాల రూపురేఖలు మారిపోయాయి. ప్రభుత్వ శాఖల అన్ని భవనాల మరమ్మతు, కొత్త నిర్మాణాలకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. పక్కా భవనాలను నిర్మిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల చెంతకు సేవలను అందించేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారు. దీంతో పాటు రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలు, ప్రజా వైద్యం కోసం వెల్‌నెస్ సెంటర్ల ద్వారా సేవలను అందుబాటులో తీసుకొచ్చారు. ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో ఆర్‌బీకేలు, గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్ల భవనాల నిర్మాణాలు చేపడుతోంది. పూర్తిస్థాయిలో నాణ్యత ప్రమాణాలతో నిర్మిస్తున్నారు. వీటి కోసం ప్రభుత్వం కోట్లాది రుపాయలను ఖర్చు చేస్తోంది.

నిధుల మంజూరు

నియోజకవర్గంలోని 115 సచివాలయాలకు గాను 18 పూర్తయ్యాయి. 115 రైతు భరోసా కేంద్రాలకు గాను 14 పూర్తయ్యాయి. మిగిలిన భవనాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గ్రామ సచివాలయాలకు అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు సైతం సొంత భవనాలు సమకూర్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో సచివాలయం భవనానికి సుమారు రూ.43.60 లక్షలు, ఆర్‌బీకేకు సుమారు. 23.94 లక్షలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు సుమారు. 20.80 లక్షల వరకు కేటాయించింది. నియోజకవర్గం వ్యాప్తంగా చేపడుతున్న భవనాలన్నీ త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు శ్రమిస్తున్నారు. దీనిపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఫలితంగా ఎటువంటి అవకతవకలు చోటు లేకుండా పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వస్తుండడంతో మారుమూల గిరిజనుల సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జీనబాడులో నిర్మాణంలో ఉన్న ఆర్‌బీకే భవనం

త్వరితగతిన పనులు

గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టే విధంగా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం.

– సాయి విజయ్, ఏఈ, పీఆర్ అనంతగిరి

ప్రజల చెంతకే పాలన



గాంధీజీ కలలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారు. గ్రామ స్వరాజ్యం స్థాపనలో భాగంగా సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే పాలనను అందిస్తున్నారు. ప్రభుత్వ సేవలను ఇంటింటికీ చేరుస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రతి గడపకు చేరుస్తున్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలు నియోజకవర్గంలో శరవేగంగా జరుగుతున్నాయి. అరకు నియోజకవర్గంలో అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోంది.

– చెట్టి పాల్గుణ, అరకు ఎమ్మెల్యే

గ్రామాల్లో ఇంటింటా సర్వే



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: గ్రామ వలంటీర్లు, ఏఎన్‌ఎంలు కలిసి ఈనెల 15 నుంచి ఇంటింటా సర్వేను చేపట్టాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆదేశించారు. ఆయన కార్యాలయంలో మంగళవారం వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను సేకరించి పూర్తిగా యాప్‌లో నమోదు చేయాలని కోరారు. అనంతరం విలేజ్ క్లినిక్‌ల వద్ద సూపర్ స్పెషాలిటి వైద్యులతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారన్నారు. ఎవరికైనా ప్రమాదకరంగా ఉంటే అలాంటి వారికి మెరుగైన చికిత్స అందించేందుకు పెద్ద ఆస్పత్రులకు పంపిస్తారని చెప్పారు. ఏఎన్‌ఎంలు, వలంటీర్లు ప్రతీ గడపనువిధిగా సందర్శించాలని సూచించారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి సాయం



అగ్ని ప్రమాద బాధితురాలికి సాయమందిస్తున్న మురళీకృష్ణ

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బిత్తరి వెంకయమ్మ అనే వృద్ధురాలికి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ సహాయం అందజేశారు. ఈ మేరకు వెయ్యి రూపాయలు విలువ చేసే బియ్యం, నిత్యావసర వస్తువులు ఇచ్చారు. ప్రమాదం గురించి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల దృష్టికి తీసుకొని వెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. వార్డు మెంబర్లు ఎం.సత్తిబాబు, ఎం.బాబూరావు, ఎం.ప్రశాంతి, డి.శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు వృద్ధురాలిని పరామర్శించారు.

వైద్య సిబ్బంది సేవలు ప్రశంసనీయం



వైద్య సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: కోవిడ్ సమయంలో వైద్య సిబ్బంది అందించిన సేవలు మరువలేమని, ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు. కోవిడ్‌లోని ఉత్తమ సేవలను అందించిన మండలంలోని లుంగపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారినిలు మంజుభార్గవి, దివ్య, సిబ్బందికి విశాఖపట్నం మదర్‌థెరిస్సా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలోని ప్రశంసపత్రాలను ఎంపీపీ శెట్టి నీలవేణి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవిడ్‌లో ప్రజారోగ్యం కోసం వైద్య సిబ్బంది తమ ప్రాణాలనుపణంగా పెట్టి, సేవలను అందించారన్నారు. ఎంపీహెచ్‌ఈవో వెంకటలక్ష్మి, నాయకులు కృష్ణమూర్తి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రహదారులు జలమయం



డుంబ్రిగుడలోని వీధిలో వర్షపు నీరు

డుంబ్రిగుడ/హుకుంపేట: మన్యంలోని పలుచోట్ల మంగళవారం భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. పొలాల్లో నీరు చేరింది. గెడ్డలు పొంగి ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాల్లోని వీధుల్లో వర్షపు నీరు చేరింది. పాడేరు– అరుకు ప్రదాన రహదారి మాసాడ గ్రామ సమీపంలోని వంతెనపై గెడ్డనీరు ఉధృతి ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

ప్రొఫెసర్ రాధాకృష్ణ మృతికి నివాళులు

అరకు ఎమ్మెల్యే పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



ప్రొఫెసర్ రాధాకృష్ణ పార్థీవదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర తదితరులు

ముంచంగిపుట్టు: ఏయూ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న వెచ్చంగి గ్రామానికి చెందిన లసంగి రాధాకృష్ణ సోమవారం గుండెపోటుతో మృతిచెందారు.. విషయం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర వెచ్చంగి గ్రామానికి చేరుకుని, ప్రొఫెసర్ రాధాకృష్ణ పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని ఓదార్చారు. మారుమూల గిరిజన ప్రాంతం నుంచి ఉన్నత స్థానాలకు చేరుకుని, అనేక మందికి యువతకు ఆదర్శవంతంగా నిలిచిన ప్రొఫెసర్ రాధాకృష్ణ సేవలను మరువలేమని, మంచిని వ్యక్తిని కోల్పోయమని, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యానారయణ, జెడ్పీటీసీ బొంజుబాబు, సూరయ్య తదితరులు ఉన్నారు.

శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చింతపల్లిరూరల్: ఉన్నతి ప్రాజెక్ట్ ద్వారా అందిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వారి పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఆశాజ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి హామి పథకంలో 2018 నుంచి 2023 వరకు పనిచేస్తు 100 రోజులు పూర్తి చేసుకున్న వేతనదారుల పిల్లలకు ఉన్నతి ప్రాజెక్ట్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారన్నారు. పలు నైపుణ్య అంశాలపై అవగాహన కల్పిస్తామని, కావున చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాల పిల్లలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా ఆమె కోరారు.

తెగుళ్ల నివారణకు సూచనలు



మందులు పిచికారీ చేస్తున్న రైతు

రాజవొమ్మంగి: ఏజెన్సీ వ్యాప్తంగా వరినాట్లు ఊపందుకొన్నాయి. కొన్ని చోట్ల నాట్లు పూర్తయ్యి సుమారు 20 రోజులకు పైగా అయింది. నాట్లు నిలబడి పచ్చగా మారుతున్న దశలో పైరు పచ్చగా ఎదుగుతున్న సమయంలో ఆకుముడత సమస్య వరిపై ఆశించడం సర్వ సాధారణం. కాగా వర్షాలు అధికంగా వున్నప్పుడు ఈ సమస్య వరిపై మరింత అధికంగా ఉంటుందని రాజవొమ్మంగి వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు అన్నారు. అక్కడక్కడ పొడచూపుతున్న ఆకుముడత నివారణకు ఆయన రైతులకు సూచనలు ఇచ్చారు. ఆకులపై పొడవుగా గోదుమ రంగు గీతలు ఆకు ముడత పొడచూపిందనడానికి గుర్తు అని తెలిపారు. కంటికి కనుపించే సైజులో ఉండే పురుగులు ఆకులను చుట్టుకొని గుడ్లుపెడతాయన్నారు. ఈ పురుగులు మొక్కల పత్రహరితాన్ని పూర్తిగా హరించడం వల్ల ఏపుగా ఎదగాల్సిన వరి పంట గిడస బారిపోతుందన్నారు. రసం పీల్చే ఈ గొంగళి పురుగులు వరి ఆకులను వాటి చుట్టు చుట్టుకొని పట్టు దారాలతో ఆకులకు చుడతాయి.

దీనితో వెడలప్పుగా వుండే వరి ఆకులు గొట్టాలుగా మారతాయన్నారు. రసాయన ఎరువులను అధికమోతాదులో వాడటం వల్ల కూడా వరిపై ఈ సమస్య వస్తుందన్నారు. వరి పిలకలు తొడిగే సమయంలో తెగులు ఉధృతి అధికంగా ఉందని, గమనించిన వెంటనే రైతులు ఫ్లూబెండియమైడ్ 0.1 మిల్లీలీటరుకు ఒక లీటరు నీటికి లేదా/ క్లొరాన్త్రనిలిపారోల్ మందును .3 మిల్లీలీటర్ల మందును ఒక లీటరుకు కలిపి మొక్కలు తడిసేలా పిచికారీ చేయాలని సూచించారు. కీటకాల ఉధృతి మరింత ఎక్కువగా వుంటే దగ్గరలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు.

పాఠశాలలో గాయకుడు ధీరజ్ సందడి



దేశభక్తి గీతాన్ని ఆలపిస్తున్న ధీరజ్

కొయ్యూరు: డొనూరు గిరిజన ఆశ్రమ పాఠశాలను గాయకుడు దొంతం శెట్టి. ధీరజ్ మంగళవారం సందర్శించాడు. పాఠశాలలో వందేమాతరం, జాతీయ గీతాన్ని ఆలపించి, చిన్నారులతో పాడించాడు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయనను అభినందించారు. విద్యార్థులతో కలిసి ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని ధీరజ్ తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మట్టితో చేసిన వినాయక ప్రతిమలను పూజించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభుదాస్, ఉపాధ్యాయులు గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న నేతలు రాంబాబు, సరస్వతి, చిట్టమ్మ

పాడేరు రూరల్ : పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి నిధులతో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలకు సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఆదేశాల మేరకు మంగళవారం పాడేరు పట్టణంలోని చాకలిపేట వీధిలో రూ.4లక్షల నిధులతో 100 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. మండలంలోని 26 పంచాయతీల్లోని గ్రామాల్లో సుమారు 5,200 మీటర్ల మేర కూడా రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తెదారులకు సూచించారు. చాకలిపేట వీధిలో సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ ఎం.సరస్వతి, ఎంపీటీసీ సభ్యురాలు సల్లా చిట్టమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల చొరవతో మెరుగుపడిన ప్రధాన రహదారి



శరభవరం ఇరుకు తూము వద్ద యంత్రాల సహాయంతో గోతులను పూడుస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి: స్థానిక ఎస్‌హెచ్‌వో (సీఐ) గోపీ నరేంద్రప్రసాద్ చొరవతో మండల కేంద్రం రాజవొమ్మంగి నుంచి శరభవరం వెళ్లే ప్రధాన రహదారి మెరుగుపడింది. శరభవరం ఇరుకు వంతెన వద్ద ఈ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఇటీవల రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి శరభవరం వచ్చిన నేపథ్యంలో ఈ రహదారి దుస్థితిని గమనించిన అధికారులు స్పందించి మంగళవారం గుంతలు పూడ్చించారు. స్థానిక ఎస్‌హెచ్‌వో గోపీ నరేంద్రప్రసాద్ ఆర్అండ్‌బీ, నేషనల్ హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి ఈ రోడ్డు మరమ్మతులకు కృషి చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

150 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

అరకులోయ రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కిరసాని శ్యాంసుందరం సేవా ట్రస్ట్ సంయుక్తంగా అరకులోయ నియోగజకవర్గం ఏఎంసీ డైరెక్టర్ రామదాసు ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్య బృందం సాయంతో మంగళవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ డైరెక్టర్ రామదాసు మాట్లాడుతూ శిబిరంలో 150 మందికి కంటి పరీక్షలు చేశామన్నారు. ఇందులో భాగంగా 42 మందికి కంటి ఆపరేషన్లకు గుర్తించామన్నారు. ఏజెన్సీలో తమ వంతుగా ట్రస్టు తరఫున గిరిజనులకు పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.భవిష్యత్తులో మరిన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు తదితర సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రతి ఒక్కరు ట్రస్ట్ అందించే సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ సుస్మిత, నాయకులు రఘునాథ్, సుంద్ర, సుందర్‌రావు, తమన్న, శంకర్ ఫౌండేషన్ బృందం అశ్వరికుమార్, ధనలక్ష్మి, సునీత, సురేష్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు

జి.మాడుగుల: మండలంలో ప్రాధాన్యత భవనాలు, జీఎస్‌బీ రోడ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖరరావు చెప్పారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు ఆయన పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. జీఈఎస్ సర్వే, పెన్షన్‌లు, ఈకెవైసీ తదితర పనులు, పథకాల అమలుపై సమీక్షించారు. ఎంఈవో సీహెచ్.బాబూరావు పడాల్, పీహెచ్‌సీ వైద్యాధికారులు శశికాంత్, రవిచంద్రశేఖర్, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



దగ్ధమైన పూరిల్లు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి వాల్మీకి నగర్‌లో ఉంటున్న బిత్తరి వెంకయమ్మ తాటాకిల్లు మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. మధ్యాహ్నం టీ తయారు చేసుకునేందుకు పొయ్యి వెలిగించగా ఒక్కసారి మంటలు ఎగసి ఇల్లంతా వ్యాపించాయి. వెంకయమ్మ బయటకు పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకుంది. స్థానికులు మంటలు ఆర్పేలోలా పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఆమె ఒంటరిగా ఉంటుందని, కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ప్రమాదంలో దుస్తులు, ఆహార ధినుసులు కాలిబూడిదనట్టు స్థానికులు చెప్పారు. వీఆర్వో నానాజీ ప్రభుత్వం తరపున తక్షణ సాయంగా బాధితురాలికి 25 కిలోల బియ్యం, పంచదార అందజేశారు. ఆస్తి నష్టం రూ.40వేలు ఉంటుందని అంచనా వేశారు. సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, అడిషినల్ ఎస్ఐ రాజు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం జారీపై విచారణ



ప్రజా సంఘాల సమక్షంలో విచారణ చేస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

అరకులోయ రూరల్: ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం జారీపై గిరిజన ప్రజా సంఘాల సమక్షంలో రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వేణుగోపాల్ మంగళవారం విచారణ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ పూర్తి ఆధారాలతో విచారణకు రావాలని కొండవీధిలో నివాసముంటున్న గిరిజనేతరుడైన రాంబాబుకు నోటీసులు అందించామన, ఆయన ఎటువంటి ఆధారాలు లేకుండానే విచరణకు హజరు కావడంతో ఈనెల 20న విచారణ వాయిదా వేసిన్నట్లు చెప్పారు. విచారణ అనంతరం పూర్వపరాలు సేకరించిన తరువాత నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. అనంతరం ఆదేశాలు మేరకు శాఖపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం జారీపై ఉన్నతాధికారులతో విచారణ చేయకుండా తూతూ మంత్రంగా పూర్తి చేశారని ఆరోపిస్తూ గిరిజన సంఘం నేత బాలదేశ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నాయకులు ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ ఎటువంటి సంబంధం లేకుండా గిరిజనేతరుడైన రాంబాబు అనే వ్యక్తికి ఏ విధంగా ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేశారన్నారు. ఉన్నతాధికారులతో పూర్తి స్థాయిలో విచారణ చేసి కఠినంగా శిక్షించాలన్నారు, ప్రజ సంఘాల నాయకులు బుజ్జిబాబు, జగన్నాథం, మగ్గన్న, హరి , ప్రసన్న, డొంబు పాల్గొన్నారు.